

పాత దువ్వూరులో ఆగని అక్రమ నిర్మాణాలు

మండల కేంద్రమైన పాత దువ్వూరు గ్రామ కంఠం భూముల్లో గత కొన్ని రోజులుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. - 8లో



స్కేటింగ్ ఎంపికలకు స్పందన

వైవీయూ, డీఎస్ఏ క్రీడామైదానంలోని స్కేటింగ్ రింక్‌లలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపికలకు స్పందన లభించింది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /24.4

జిల్లాలో సోమవారం 24.4 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

24న పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

కడప సెవెన్‌రోడ్స్ : పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహిస్తున్నామని జిల్లా ఖజనా శాఖ ఉప సంచాలకులు ఎంఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ ఆఫ్ విజయవాడ, సంచాలకులు రాష్ట్ర ఖజానాశాఖ సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి పెన్షన్, జీపీఎఫ్‌లలో ఏవైనా సమస్యలు ఉంటే అదాలత్‌లో తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడు మండలాల్లో వర్షం

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఏడు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా సీకే దిన్నెలో అత్యధికంగా 17.8 మిల్లీ మీటర్ల వర్షం కురవగా వేంపల్లిలో 9.4 ఎంఎం, సిద్దవటంలో 6.8 ఎంఎం, పోరుమామిళ్లలో 4.8 ఎంఎం, అట్లూరులో 2.4 ఎంఎం, గోపవరంలో 1.2 ఎంఎం, వీఎన్‌పల్లిలో 1 ఎంఎం వర్షం కురిసింది.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : పోస్టుమెట్రిక్ రెన్యూవల్ స్కాలర్‌షిప్‌లకోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కె.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలలో చదువుతున్న అర్హులైన విద్యార్థులు వెంటనే కళాశాల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈనెల 30వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం విద్యార్థులు వెంటనే బయోమెట్రిక్ కూడా పూర్తి చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలు రెన్యూవల్ విద్యార్థుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి జిల్లా సంక్షేమశాఖకు ఆన్‌లైన్‌లో తక్షణమే పంపాలన్నారు.

ఎస్సీ విద్యార్థులు ఐపీపీబీ ఖాతాను తెరవాలి

భారత ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు సమీప పోస్టాఫీసుల్లో ఐపీపీబీ ఖాతాను తెరవాలని తెలిపారు. ఆ మేరకు కళాశాల ప్రధానాచార్యులు తమ ఊరి పోస్టుమెన్ సహకారంతో కళాశాలలో అకౌంట్ ఓపెన్ క్యాంప్ నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం కేవలం ఎస్సీ స్టూడెంట్ ఆధార్, మొబైల్ నెంబరు అవసరముంటుందని పేర్కొన్నారు. ఈ అకౌంటుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లింక్ వెంటనే అవడం వల్ల స్కాలర్‌షిప్ డబ్బులు ఇబ్బందులు లేకుండా క్రెడిట్ అవుతాయని వివరించారు.

పీఆర్‌టీయూ కొత్త కార్యవర్గం



యంవి కృష్ణప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు



రామాంజనేయరెడ్డి, జిల్లా కార్యదర్శి

కడప ఎడ్యుకేషన్ : ఏపీ పీఆర్‌టీయూ వైఎస్సార్ జిల్లాలో గతంలో భర్తీకాకుండా ఖాళీగా ఉన్న పదవులకు నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, ఎంవి గిరిప్రసాద్, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్ సమక్షంలో ఎన్నుకున్నారు. ఇందులో పీఆర్‌టీయూ వైఎస్సార్ కడప జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా యంవి కృష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శిగా కె. రామాంజనేయరెడ్డిలను ఎన్నుకున్నారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీ



మాదన విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు



పాలెం మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి

కడప ఎడ్యుకేషన్ : వైఎస్‌ఆర్ కడప జిల్లా యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన జిల్లా స్వర్ణోత్సవ మహాసభలలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా మాదన విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పాలెం మహేష్ బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడిగా నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులుగా రవికుమార్, సుజాతరాణిలు, ట్రెజరర్‌గా నరసింహారావు, కార్యదర్శులుగా చెరుకూరి శ్రీనివాసులు, డి.వి.రవీంద్రుడు, చెన్నయ్య, సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, మురళీకృష్ణ, చంద్ర ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, శివ ప్రసాద్, ఈరి బాలజోజిలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పాలెం మహేష్ బాబు, మాదన విజయకుమార్, రూతు ఆరోగ్య మేరీ, ఓబుల్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ప్రభాకర్, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎ.డి. దేవదత్తం, టి.వి.రమణ, రవిశంకర్, ఫయాజుద్దీన్, మేరి ప్రసన్నలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు, పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా వ్యవహరించారు.

సబ్సిడీ విత్తనాలు వద్దు..!

ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేసే విత్తనాలు వద్దని చాలా మంది రైతులు అంటున్నారు. బహిరంగ మార్కెట్ రేటుకు, ప్రభుత్వ రేటుకు పెద్ద తేడా లేదని.. పైగా ప్రతి 20 కేజీల బస్తాకు రెండు కిలోలు నాసిరకం విత్తనాలు ఉంటున్నాయని మండి పడుతున్నారు. నాణ్యమైన విత్తనాలు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో రబీలో సాగుకానున్న శనగ విస్తీర్ణం	: 82, 261 హెక్టార్లు
జిల్లాకు కేటాయించిన శనగ విత్తనాలు	: 72,336 వేల క్వింటాళ్లు
ఇప్పటి వరకు జిల్లాకు వచ్చిన విత్తనాలు (20వ తేదీకి)	: 23,606 క్వింటాళ్లు
విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల సంఖ్య	: 27,825 మంది
రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అవసరమైన విత్తనాలు	: 41,454 క్వింటాళ్లు
ఇప్పటి వరకు పంపిణీ చేసిన విత్తనాలు	: 8,680 క్వింటాళ్లు
విత్తనాలు పొందిన రైతులు సంఖ్య	: 12,879





కమలాపురం మండలంలో విత్తనాల నాణ్యతను పరిశీలిస్తున్న రైతులు (ఇన్‌సెట్) పంపిణీ చేసిన విత్తనాల్లో తేలిన నాసిరకం విత్తనాలు

కడప అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేస్తున్న శనగ విత్తనాలను తీసుకెళ్లేందుకు రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాల్లో నాసిరకం విత్తనాల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లుగా రైతులు తెలిపారు. దీంతో చాలా మంది సబ్సిడీ విత్తనాలను తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. పైగా ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే విత్తనాల ధరకు, బహిరంగ మార్కెట్‌లో దొరికే విత్తనాల ధరకు కూడా పెద్ద తేడా లేకపోవడంతో చాలా మంది రైతులు తమకు అవసరం ఉన్నా శనగ విత్తనాలను బయట మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం మాత్రం రైతుల వద్ద నుంచి శనగలు కిలో 94 రూపాయల ధరతో అంటే క్వింటాల్ రూ. 9400తో కొనుగోలు చేసి వాటిని గ్రేడింగ్ చేసి తిరిగి 25 శాతం సబ్సిడీతో కిలో రూ. 70.50 తో అంటే క్వింటాల్ రూ. 7050 తో రైతులకు అందిస్తున్నారు. దీంతో వాటిని తీసుకెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

ప్రతి 20 కిలోల బస్తాకు రెండు కిలోలు...

ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేస్తున్న శనగ విత్తనాల్లో నాసిరకం విత్తనాలు ఎక్కువగా ఉన్నాయని.. ప్రతి 20 కిలోల బస్తాలో కిలోన్నర నుంచి రెండు కిలోల విత్తనాలు నాసిరకంగా ఉన్నట్లు పలువురు రైతులు తెలిపారు. ఇందులో 50 సెంట్ల భూమి ఉన్న ప్రతి రైతుకు ఒక బస్తా చొప్పున, 5 ఎకరాల వరకు 10 బస్తాలను శనగలను సబ్సిడీతో రైతులకు అందిస్తున్నారు. అంటే 5 ఎకరాల శనగ పంటను సాగు చేసే రైతు 10 బస్తాలు తీసుకుంటే ఇందులో 15 కేజీల నుంచి 20 కిలోల వరకు నాసిరకం విత్తనాలు వస్తే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సబ్సిడీలోను కోతే....

గత ప్రభుత్వం శనగ విత్తనాలను రైతులకు 40 శాతం సబ్సిడీతో అందించింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం సబ్సిడీని 25 శాతంకు కుదించింది. దీంతో రైతులకు కిలోపై రూ. 15 అదనపు భారం పడుతుంది. ఈ లెక్కన 20 కిలోల బస్తాపై రూ. 300 అదనంగా చెల్లించాల్సి వస్తుంది. 5 ఎకరాలు ఉన్న రైతు 10 బస్తాల శనగలు తీసుకుంటే రూ. 3000 వారికి అదనపు భారం పడనుంది. అసలే ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక సాగు చేసిన పంటలు సరిగా పండక చాలా మంది రైతులు నష్టపోయారు. ఈ రబీలో శనగ సాగుచేసి పది రూపాయలు కళ్ల చూద్దామనుకుంటే కూటమి ప్రభుత్వమేమో సబ్సిడీలోనే కోత విధించి భారాన్ని మోపుతోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 72 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ మేరకు ఆదివారం నాటికి జిల్లాకు 23,606.8 క్వింటాళ్లు వచ్చాయి. ఇందులో ఎక్కువ విస్తీర్ణంలో సాగుకానున్న శనగ పంటకు సంబంధించి అధిక విత్తనాలను కేటాయించారు. ఇందులో కమలాపురం మండలానికి 2921.6 క్వింటాళ్లు, కొండాపురం 2161.2 క్వింటాళ్లు, పెద్దముడియం 2193 క్వింటాళ్లు, వీఎన్‌పల్లి 2333 కింటాళ్లు, సింహాద్రిపురం 3069.2 క్వింటాళ్లు, ఎర్రగుంట్ల 2046.8 క్వింటాళ్లు కేటాయించారు.

ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం...



బయట మార్కెట్‌లో శనగ విత్తనాలు క్వింటాల్ రూ. 7500 కంటే తక్కువతో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం 25 శాతం రాయితీతో క్వింటాల్‌ను రూ.7050తో రైతులకు కట్టబెట్టడం వెనక ప్రభుత్వం కంపెనీలతో లోపాయికారి ఒప్పందం చేసుకుని రాయతీ మొత్తాన్ని పంచుకునే యత్నం చేస్తున్నారు. వల్లూరు మండలంలో పంపిణీ చేసిన పొద్దుటూరు శ్రీ లక్ష్మి వెంకటసాయి ఆగ్రోసీడ్ కంపెనీకి చెందిన శనగ విత్తనాలు నాసిరకంగా ఉన్నాయి. వీటిపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. రైతులకు మేలు రకం విత్తనాలను సరఫరా చేయాలి. చేయకపోతే ఆందోళన చేస్తాం.
- గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు

మా దృష్టికి రాలేదు...



శనగ విత్తనాలకు సంబంధించి నాసిరకం గురించి ఎక్కడా మాదృష్టికి రాలేదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు శనగపంటను అధిక విస్తీర్ణంలో సాగు చేసే మండలాలకు సంబంధించి 23,606 క్వింటాళ్లు కేటాయించాము. ఎక్కడైనా నాసిరకం విత్తనాలు వస్తే రైతులు మా దృష్టికి తీసుకరావాలి. అవసరం అయితే విత్తనాలను రీప్లేస్ చేసి ఇస్తాం.
- జగదీష్, ఏపీ సీడ్స్ మేనేజర్

గండికోట లోగో, ట్యాగ్‌లైన్ ఆవిష్కరణ



గండికోట లోగో, ట్యాగ్‌లైన్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : గండికోట వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించే విధంగా సృజనాత్మకమైన లోగో, ట్యాగ్‌లైన్‌నుజిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, వైఎస్సార్‌జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి సురేష్‌కుమార్ అధికారికంగా ప్రకటించారు. లోగో డిజైన్ పోటీలో గెలుపొందిన తుషార్ సివాంకర్‌ను అభినందించారు. గండికోటలో పర్యాటకం పెంచడమే కాకుండా గండికోట అందించే ప్రత్యేక అనుభవాలను హైలెట్ చేయడం కోసం రూపొందించారని సురేష్‌కుమార్ తెలిపారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌తో ఎయిర్ ఫోర్స్ అధికారుల భేటీ

కడప సెవెన్‌రోడ్స్ : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు సోమవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ అవకాశాలకు యువతకు ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తాము జిల్లాకు వచ్చామని నాన్ కమిషన్డ్ అధికారులు ఎన్.సందీప్, సురేంద్రసింగ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఐఏఎఫ్ కిట్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు అందజేసి ఆమె చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఆ తర్వాత అన్నమయ్య ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐఏఎఫ్ అధికారులు యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీరితోపాటు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి శ్రీమణికంఠ, స్టెప్ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

జన సురక్ష పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

ప్రత్యేక డీఎల్‌ఆర్‌సీ బ్యాంకర్ల సమావేశంలో జిల్లా ఇంఛార్జి కలెక్టర్ అదితి సింగ్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జన సురక్ష పథకాల (పీఎంజేజేబీవై అండ్ పీఎంఎస్‌బీవై)పై ప్రజల్లో పూర్తి అవగాహన పెంచేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో ప్రత్యేక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం (డీఎల్‌ఆర్‌సీ) జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన జన సురక్ష పథకాల అవగాహన, అమలు లక్ష్యాలపై ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా ఇంఛార్జి కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 3 నెలల పాటు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. పీఎంజేజేబీవై (ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా), పీఎంఎస్‌బీవై (ప్రధాన మంత్రి సురక్ష బీమా) పథకాల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ పథకాల ప్రయోజనాలను ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశంకు సంబంధించిన అజెండా, వివరాలను, పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని ఆయా శాఖల అధికారులు ఇన్‌ఛార్జి కలెక్టర్‌కి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్ధనం, డీపీఓ రాజ్యలక్ష్మి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, నాబార్డ్ ఏజీఎం విజయ విహారి, కెనరా బ్యాంకు ఏజీఎం మురళి మోహన్, యూబీఐ ఆర్ఎం లక్ష్మీ తులసి, పరిశ్రమల శాఖ జీఎం చంద్ బాషా, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. శారదమ్మ పాల్గొన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించాలి

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఇన్‌ఛార్జి కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిలు హాజరై అర్జీలు స్వీకరించారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

జిల్లాలోని సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ సోమవారం విడుదల చేశారు. జిల్లాలోని భారీ, మధ్యతరహా, చిన్నతరహా నీటి వనరుల కింద ఉన్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ఇప్పటికే సవరించిన షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టులైన కేసీ కెనాల్‌కింద 96,137.58 ఎకరాల విస్తీర్ణం ఉంది. మైలవరం జలాశయం కింద 69,772.53 ఎకరాల ఆయకట్టు ఉంది. పులివెందుల బ్రాంచ్ కెనాల్ కింద 49,839.21 ఎకరాలు ఉన్నాయి. ఎస్‌ఆర్‌బీసీ కెనాల్ కింద పెద్దముడియం మండలంలోని కొండసుంకేసుల, ఉయ్యాలవాడ మండలంలోని తుడుములదిన్నెలో కలిపి 3690.82 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇక మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులైన లోయర్ సగిలేరు కింద 12,868.97 ఎకరాలు, అప్పర్ సగిలేరు కింద 6034.26 ఎకరాలు, బుగ్గవంక ప్రాజెక్టు కింద 6455.75 ఎకరాల ఆయకట్టు ఉంది. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 112 చెరువుల కింద 30,076.81 ఎకరాలు ఉన్నాయి.

ఉచిత డీఎస్సీ శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష

కడప రూరల్ : ప్రభుత్వ సాంఘిక గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ నిమిత్తం స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం టెట్ అర్హత కలిగి వార్షికాదాయం రూ. 2.50 లక్షల్లోపు ఉండాలన్నారు. ఈ డీఎస్సీ శిక్షణ తీసుకునేందుకు అర్హత గల ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రెండు రోజుల్లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో అర్హులైన మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణను పొందేందుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు జ్ఞానభూమి వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకం



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహమద్, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు తదితరులు



అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న జడ్జి, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఆరవ జిల్లా అదనపు న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహమద్, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ కొనియాడారు. సోమవారం నగరంలోని పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వహించిన స్మృతి పెరేడ్‌కు జిల్లా అదనపు న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహమద్, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత వారు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి అమరులైన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి వెన్నెముక లాంటి పోలీసులు లేకపోతే అరాచక శక్తులు విజృంభిస్తాయన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను రక్షించే క్రమంలో పలువురు ప్రాణాలు సైతం అర్పించారని, ప్రాణ త్యాగం చేసిన అమరులైన పోలీసులకు నేడు నివాళులర్పిస్తున్నామన్నారు. పాలనా వ్యవస్థలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ సమాజంలో అందరూ పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులో తమ భార్య పిల్లలతో సంతోషంగా ఉంటే, మరోవైపు అదే సమయంలో పోలీసులు ఆ సంతోషాలకు దూరంగా వారి కుటుంబాలకు దూరంగా ఉండి పగలనక, రాత్రనక విధుల్లో నిమగ్నమై ఉంటారని తెలిపారు. ఏడాది కాలంలో జిల్లాలో 17 మంది సిబ్బంది వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారు అందించిన సేవలకు పోలీసు శాఖ ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. వారి కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లాలో విధినిర్వహణలో అమరులైన పోలీసు, హోం గార్డుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాష్ బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ, జిల్లాలోని డీఎస్పీలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, నగరంలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

• ఛాయా చిత్ర ప్రదర్శన..

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను జిల్లా అదనపు న్యాయమూర్తి, ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు శాఖ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన ఛాయా చిత్రాలను జిల్లా ఎస్పీ అతిథులకు వివరించారు.

• ఆయుధాల ప్రదర్శన

పోలీసులు వినియోగించే ఆయుధాల ప్రదర్శన 'ఓపెన్ హౌస్'ను న్యాయమూర్తి, ఇన్‌ఛార్జి కలెక్టర్ తిలకించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, బాంబు డిస్పోజబుల్ టీం, ఫింగర్ ప్రింట్, పోలీసు కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్స్,, ఆయుధాల - విడి భాగాల సమాచారం గురించి (ఎకె 47, విల్ పిస్టల్, గ్లో 17, కార్బన్, ఇన్సాస్ రైఫిల్, గ్యాస్ గన్, గ్రేనేడ్, ఫోరెన్సిక్ , ఆర్ఎఫ్ఎస్ఎల్) జిల్లా ఎస్పీ వివరించారు. బాడీ వర్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరా, వీహెచ్ఎఫ్ సెట్, రోబో డ్రెస్, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రదర్శనలో ఉంచారు.

• ఆకర్షణగా పోలీసు జాగిలాలు

నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బృందంలో ఇటీవల నూతనంగా చేరిన డయానా, రూబీలతోపాటు లూసీ పేరుతోగల శునకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాగిలాల గురించి జిల్లా ఎస్పీ వివరించారు. నేర పరిశోధనలో, వీవీపీల రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.

• కన్నీటి పర్యంతం

కడప పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు సంస్మరణ దినం సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబసభ్యులను జడ్జి, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ తదితరులు సత్కరించి జ్ఞాపికలు అందించారు. అందులో భాగంగా అమరుల చిత్రపటాన్ని వారి కుటుంబీకులకు అందజేశారు. ఈ క్రమంలో ఆ ఫొటో చూడగానే ఆ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.
- మొహమద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







క్లుప్తంగా

చిరుతల సంచారంతో భయాందోళన

వేముల : మండలంలోని పెండ్లూరు చెరువు పరిసర ప్రాంతాలలో చిరుతల సంచారంతో ప్రజలలో భయాందోళనలు నెలకొన్నాయి. ఆదివారం గొర్రెల కాపరులకు ఓ చిరుత కనిపించగా.. సోమవారం కూడా గొర్రెల కాపరులకు రెండు చిరుతలు కనిపించినట్లు చెబుతున్నారు. చిరుతలు సంచరిస్తుండటంతో సమీప పొలాల్లో రైతులు, కూలీలు పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు. చెరువు ప్రాంతంలో ముళ్ల పొదలు అధికంగా ఉండటంతో అక్కడ చిరుతలు సంచరిస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ముఖ్యంగా పెండ్లూరు, పెర్నపాడు గ్రామాల మధ్య ఉన్న చెరువు ప్రాంతంలోని పొలాల్లో పంటలు సాగు చేయడంతో పనులు ఉన్నప్పటికి చిరుతల సంచారంతో పొలాల్లోకి వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలు జంకుతున్నారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేల్ల సాంబశివారెడ్డి ముద్దనూరు అటవీ శాఖ రేంజర్ అశోక్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చెరువు ప్రాంతంలో చిరుతలు సంచరిస్తున్నాయని.. వాటి కదలికలను కనిపెట్టి పట్టుకుని అటవీ ప్రాంతంలో వదలాలని కోరారు.

నేడు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జమ్మలమడుగులోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టాటా క్యాపిటల్, అమర్‌రాజా గ్రూపు సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని జమ్మలమడుగు ప్రాంత నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేములలో..

వేముల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు వస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ అభ్యర్థులు 19–40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.

ట్రై సైకిల్ ఇచ్చి ఆదుకోండయ్యా!

కడప కోటిరెడ్డిసర్కిల్ : రెండు కాళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తనకు ట్రై సైకిల్ మంజూరు చేసి ఆదుకోవాలని కడప నగరం ఆకులవీధికి చెందిన పెద్దేటి ప్రకాశమ్మ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అతి కష్టంపై వచ్చి ఉన్నతాధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చిన్న వయస్సుల్లోనే తల్లిదండ్రులను కోల్పోయానని, అనాథగా జీవిస్తున్నానని తెలిపారు. చిన్నప్పటినుంచి కాళ్లు పనిచేయకపోవడంతో జీవనం భారంగా మారిందన్నారు.

పాత దువ్వూరులో ఆగని అక్రమ నిర్మాణాలు

- రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకుల అండతో సాగుతున్న నిర్మాణాలు
- ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి
- 20 ఏళ్లుగా కాపాడుతున్న ప్రభుత్వ భూములు అక్రమణ దారుల చేతుల్లోకి



దువ్వూరులో గ్రామ కంఠం భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : మండల కేంద్రమైన పాత దువ్వూరు గ్రామ కంఠం భూముల్లో గత కొన్ని రోజులుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాల్సిన అధికారుల అండదండలతో నిర్మాణాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. పాత దువ్వూరులో గ్రామ కంఠంలోని సర్వే నెంబర్ 371లో 33 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వీటిపై పలువురు ఫిర్యాదులు చేయగా కొన్ని రోజుల పాటు అక్రమ నిర్మాణాలు ఆగాయి. మళ్లీ యథాతథంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలు టీడీపీ ముఖ్య నాయకులు కనుసన్నల్లో, రెవెన్యూ అధికారుల అండదండలతో జరుగుతున్నట్లు సమాచారం. కడప–కర్నూలు జాతీయ రహదారిలోని పాత దువ్వూరులోని గ్రామ కంఠం భూముల్లో సర్వే నెంబరు 381/27లో 1.84 ఎకరాలు, 371/25లో ఎకరా, 371/24లో 1.24 ఎకరాలు డికేటీ పట్టా భూములుగా ఉన్నాయి. సర్వె నెంబరు 371/3లో 0,82 ఎకరాలను 2002లో రెఫరెన్స్ నెంబరు ఈ1/3698/98 ప్రకారం మండల రెవెన్యూ కార్యాలయం నిర్మించేందుకు జమ్మలమడుగు ఆర్డీఓ ఉత్తర్వులు సైతం జారీ చేశారు. ఇక్కడ భూములు భారీగా ధరలు పలుకుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల కోసం ఈ భూమలు వినియోగించుకోవాలని ప్రభుత్వం చూస్తున్నప్పటికీ కూడా అక్రమార్కులు ఈ భూముల్లోనే అక్రమ నిర్మాణాలు చేపట్టినా అధికారులు చర్యలు తీసుకోకపోవటం శోచనీయం. ఈ భూముల్లో ఇప్పటికే గ్రామ సచివాలయం, స్త్రీశక్తి భవనం, గ్రామ సచివాలయం, మండల వ్యవసాయ కార్యాలయాలతో ఇంకా పలు కార్యాలయాలు ఉన్నాయి. ఈ స్థలంలోనే ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు కూడా గతంలో అధికారులు నిర్ణయించారు. అయితే కొంత మందికి ఈ సర్వే నెంబర్లలో అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగి పలువురి పేరుతో చేతుల మారినట్లు తెలుస్తోంది.

ఎన్‌ఓసీ ఎవరు మంజూరు చేస్తున్నారు?

ఈ గ్రామ కంఠం భూములు ఎలా రిజిస్ట్రేషన్ అవుతున్నాయో, అదే విధంగా వారికి ఎన్‌ఓసీ పత్రాలు ఎవరు మంజూరు చేస్తున్నారో రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. భూములను రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్‌లు వేసి ఇక్కడ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు నిర్మాణాలు చేసి వ్యాపారాలు సైతం జరుగుతున్నాయి. ఈ వ్యవహారం అంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు సమాచారం. అదే విధంగా ఈ భూములు కన్వర్షన్ కాకుండా ప్లాట్‌లు విక్రయిస్తుండగా గమనార్హం. రెవెన్యూ అధికారుల ఉదాశీనత వల్లనే గ్రామ కంఠం భూములకు రక్షణ లేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలను ఆపి గ్రామ కంఠం భూములు కాపాడాలని, భవిష్యత్తు తరాలకు ఈ భూములు ప్రజల అవసరాల కోసం ఉపయోగపడాతాయనే ఉద్దేశంతో ఇప్పటికే మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను అడ్డుకుని గ్రామ కంఠం భూములకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తహసీల్దారు ఎమన్నారంటే..

దువ్వూరులోని గ్రామ కంఠం భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తహసీల్దారు అక్బల్ బాషాను వివరణ కోరగా.. అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ఫిర్యాదు అందాయన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రైవింగ్‌లో అత్యుత్తమ శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు ద్వారా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని, దీనిని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు చేరిన 22వ బ్యాచ్ అభ్యర్థులకు సోమవారం మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 21 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయిందని, 22వ బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 16 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. 30 ఏళ్ల అనుభవం కలిగిన రీజినల్‌సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ల చేత థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

నాన్ రెసిడెన్షియల్ రిఫ్రెషర్ కోర్సు

ప్రభుత్వ నిబంధనల మేరకు రవాణాశాఖ అనుమతితో ఒకరోజు నాన్ రెసిడెన్షియల్ రిఫ్రెషర్ కోర్సు ఏపీఎస్ ఆర్టీసీ హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూలు కడపలో శిక్షణ తీసుకుని సర్టిఫికెట్ పొంది లైసెన్సును రెన్యూవల్ చేసుకోవచ్చనికడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. ఒకరోజు నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ కోర్సు కోసం రూ.1000 ఫీజుతోపాటు 18 శాతం జీఎస్టీ అదనమన్నారు. ట్రైనింగ్‌లో చేరేందుకు ముందుగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం ఒకరోజు ట్రైనింగ్ పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఇతర వివరాలకు 99592 25774, 738828 65145 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

స్కేటింగ్ ఎంపికలకు స్పందన



స్కేటింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి

కడప స్పోర్ట్స్ : యోగివేమన విశ్వవిద్యాలయం, డీఎస్ఏ క్రీడామైదానంలోని స్కేటింగ్ రింక్‌లలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. వైవీయూలో నిర్వహించిన రోడ్ రేస్ స్కేటింగ్‌ను క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడను సాధన చేయడం ద్వారా శరీరం చురుగ్గా, బ్యాలెన్సింగ్‌గా ఉంటుందన్నారు. ఈ క్రీడ సాధన చేయడం ద్వారా ఏకాగ్రత, సమన్వయం సాధ్యమవుతాయన్నారు. స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇజ్రాయిల్ మాట్లాడుతూ నవంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు 36వ రాష్ట్రస్థాయి స్కేటటింగ్ పోటీలు కాకినాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం రోడ్ రేస్ నిర్వహించి జిల్లా జట్టును ప్రకటించారు. అనంతరం కడప నగరంలోని డీఎస్ఏ స్కేటింగ్ రింక్‌లో రింక్ రేస్ నిర్వహించి జిల్లా జట్టును ప్రకటించారు. కార్యక్రమంలో స్కేటింగ్ శిక్షకులు విలియం కేర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ ఇన్‌లైన్ జట్టు

బి. కావ్యకీర్తికారెడ్డి, ఎస్.వి. లోహన్‌అయాంక్‌రెడ్డి, పి. రిషి, బి. రయాన్ష్, పి. మారుతీశ్రీరామ్, బి. సాత్విక్, ఆర్.కె.జెస్సికా ఏంజిల్, ఎస్.సాయినిర్వణ, ఎస్.వి. పార్థీవన్‌రెడ్డి, ఎస్. నరసింహహేమంత్, టి. జెస్సీరోహన్, డి.సాకేత్‌రెడ్డి, ఎ. శశాంక్‌రెడ్డి.

స్కేటింగ్ క్వాడ్ జట్టు

కె. జస్వితారెడ్డి, ఎస్.కె.అర్షన్ నౌషిం, వి. దివ్యసింహ, ఎస్.జితిన్‌రెడ్డి, ఎస్. అజిత్, ఎస్. అభిసిత్, పి.వి.యశ్విన్‌రెడ్డి, సి.ఆర్.చాతుర్య, ఎస్.కె. ఐరాముంతాజ్, సి.బి.చారున్య, కె. భవేష్‌రెడ్డి, ఎస్ఎండీ సొఫిక్, నాగనిర్వన్ నందన్‌రెడ్డి, శ్రీసైఫ్‌నాయక్, ఉపాసన, సాదియఅలీ, యాదినిరెడ్డి, శ్రీవర్ధినాయక్, ఆర్.వర్షిత్‌రెడ్డి, లక్షిత్ ప్రణవ్‌సాయి, పార్థీవ్‌రెడ్డి, అమీర్, మనస్విని, తారక్‌రామ్, సింహదర్శన్, సాయిశశాంక్.

ఎస్‌జీఎఫ్ చదరంగం జిల్లా జట్లు ఎంపిక



క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న సెలక్షన్ కమిటీ సభ్యులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి చదరంగం ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి మాట్లాడుతూ మేధో క్రీడ చదరంగం అని, చదరంగంలో సాధన చేయడం ద్వారా చక్కటి ఏకాగ్రత కుదురుతుందన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికల జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు ఉమేష్, అనీస్‌దర్బారీ, ఆర్బిటర్ శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్.ఎ. సునీల్, ఎజాస్ అహ్మద్, మహబూబ్‌బాషా, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాలబాలికల జట్లు..

అండర్–14 బాలురు : వినూత్, సిద్ధార్థ్, చాణుక్య, అనురాగ్ ప్రీతం.

అండర్–14 బాలికలు : లాస్యశ్రీ, చిన్మయి, దివ్యాన్షి, వినయన, పూజ.

అండర్–17 బాలురు : రుత్విక్‌రామ్, వరదరాజస్వామి, జతిన్‌కుమార్, కార్తికేయ.

అండర్–17 బాలికలు : సజ్యోత్స్న, తేజోమయి, గంగాదీప్తి, చాతుర్య, జాహ్నవి.

దౌర్జన్యంగా ఇంటిని కూల్చివేశారని ఫిర్యాదు



మారుతీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలు కూల్చివేసిన దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మారుతీనగర్‌లో తన ఇంటిని దౌర్జన్యంగా కూల్చివేసిన కడప మండల సర్వేయర్ సర్వేశ్వర్, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి హరినాథరెడ్డి, సోమశేఖర్‌రెడ్డిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ. గ్రేస్ నిర్మల అనే మహిళ కోరారు. సోమవారం ఆమె వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను నగరపాలక సంస్థలో ప్లాన్ అప్రూవల్ పొంది, పట్టా స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్నానన్నారు. అయితే మాకు దక్షిణంగా ఉన్న కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి బంధువులైన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి హరినాథరెడ్డి, సోమశేఖర్‌రెడ్డిలు తాము ఊర్లో లేనప్పుడు వాట్సాప్ ద్వారా సర్వేకు రమ్మని పిలిచారన్నారు. ఊర్లో లేము.. ఇంకో రోజు సర్వే నిర్వహించాలని కోరినా మండల సర్వేయర్ ప్రలోభాలకులోనై వారికి వారే సర్వే చేసుకొని, తమ ఇంటిని జేసీబీతో పగులగొట్టడం దారుణమన్నారు. నిబంధనల ప్రకారం మూడు నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా రాకపోతే సర్వే చేసుకొని చట్టప్రకారం చర్యలు చేపట్టాలిగానీ ఒక్కసారి కూడా నోటీసు ఇవ్వకుండా ఇంటిని కూలగొట్టడం అన్యాయమన్నారు. సర్వేపై తాము అప్పీల్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎమ్మెల్యే అండతోనే దౌర్జన్యంగా కూల్చివేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన



నిరసన తెలుపుతునవలంటీర్లు, ఏఐవైఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : వలంటీర్లు తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లను విధుల్లోకి తీసుకుంటామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. అతితక్కువ వేతనంతో ప్రజలకు నిస్వార్థ సేవలు వలంటీర్లు అందిస్తున్నారని తెలిపారు. ఒక పార్టీకి అనుబంధంగా పనిచేశారనడంలో ఏమాత్రం నిజం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ. 10 వేల వేతనాన్ని ఇస్తామని నమ్మబలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాట తప్పారని ఆరోపించారు. త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వలంటీర్ల సమస్యల పరిష్కారంపై తీర్మానం ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.దస్తగిరి, వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ప్రభావతి, జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో వృద్ధులకు టోకరా

- ఆరు ఎకరాల భూమిని కొట్టేసిన వైనం
- న్యాయం చేయాలని వృద్ధ దంపతుల విన్నపం



న్యాయం చేయాలని కోరుతున్న వృద్ధ దంపతులు

ఎర్రగుంట్ల : బతికి ఉన్నా చనిపోయినట్టుగా నకిలీ సర్టిఫికెట్ సృష్టించి తనకు చెందిన 6 ఎకరాల భూమిని ఓ వ్యక్తి భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని వృద్ధుడు భూమిరెడ్డి చిన్ననాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి భూమిరెడ్డి చిన్ననాగిరెడ్డి తన కుమారుడైన బాలనాగిరెడ్డి నివాసం ఉండే యర్రగుంట్లలోకి వచ్చిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముద్దనూరు మండలం చిన్నదుద్యాల గ్రామానికి చెందిన భూమిరెడ్డి చిన్ననాగిరెడ్డి, వెంకటలక్షుమ్మల అనే వృద్ధ దంపతులకు బాలనాగిరెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి అనే సంతానం కలరు. వీరిలో బాలనాగిరెడ్డి యర్రగుంట్లలో నివాసం ఉంటున్నారు. చిన్ననాగిరెడ్డి, వెంకటలక్షుమ్మలు చిన్నదుద్యాల గ్రామంలో ఉంటున్నారు. చిన్నదుద్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ముద్దనూరు పట్టణంలోని సబ్‌రిజిష్టర్ కార్యాలయంలో రైటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే అతడు తన చేతి వాటంతో భూమిరెడ్డి చిన్ననాగిరెడ్డి చనిపోయినట్టు నకిలీ సర్టిఫికెట్‌ను సృష్టించాడన్నారు. ఆ సర్టిఫికెట్‌తో చేతివాటం ప్రదర్శించి భూమిరెడ్డి చిన్ననాగిరెడ్డికి చెందిన సర్వేనంబరు 116/1, 116/9 లలో ఉండే 6 ఎకరాల భూమిని అతడి పేరు మీద ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని వాపోయారు. తాను బతికి ఉండగానే మృతి చెందినట్టుగా ఏవిధంగా సర్టిఫికెట్ ఇచ్చారని ప్రశ్నించాడు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ శాఖ అధికారులను సంప్రదించిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈవిషయంలో సీఎం స్పందించి తమకు న్యాయం చేసి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆ వృద్ధ దంపతులు కోరారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి



భగత్‌సింగ్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : ఇంటర్మీడియట్ విద్యార్థిని దస్తగిరమ్మను హత్య చేసిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాల ని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీర పోగురవి, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియంచిన్ని పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిద్దవటం రోడ్డులోని భగత్‌సింగ్ విగ్రహం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు భానుప్రకాష్, డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ కార్యదర్శి బాలగురవయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సురేష్, మాపీరా, రాజు తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరమ్మ హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



పోరుమామిళ్లలో కొవ్వొత్తుల ప్రదర్శన

పోరుమామిళ్ల: ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మను ప్రేమ పేరుతో వేధించి అత్యంత కిరాతకంగా పెట్రోలు పోసి కాల్చిచంపిన ఘటనకు నిరసనగా పోరుమామిళ్లలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్టీసీ బస్టాండులో కొవ్వొత్తులతో మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి, ప్రగతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసులు, సీడీపీఓ లక్ష్మీదేవి, రామసాయి సేవా సమితి ఛైర్మన్ కాటసాని వెంకటరెడ్డి, సీపీఎం, సీపీఐ కార్యదర్శులు భైరవప్రసాద్, పిడుగు మస్తాన్, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగన్న, ఫణిరావు, విశ్రాంత ఆర్మీ కెప్టెన్ రాముడు, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన మిథున్ చక్రవర్తిరెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని పొలతల శైవ క్షేత్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపేట గ్రామానికి చెందిన ఏ.మిథున్ చక్రవర్తి రెడ్డి(30) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట గ్రామానికి చెందిన మిథున్‌చక్రవర్తిరెడ్డి, సాంబశివారెడ్డి ఇద్దరు ద్విచక్ర వాహనంలో పొలతల శైవ క్షేత్రంలో దైవ దర్శనాకి వెళ్లి తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా పొలతల సమీపంలో ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఓవర్‌టైక్ చేస్తుండగా బైక్ అదువు తప్పి కిందపడ్డారు. అతనిపై ట్రాక్టర్ ఎక్కుడంతో తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంలో ఉన్న సాంబశివారెడ్డికి గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొబైల్ దుకాణంలో చోరీకి యత్నం

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ కాంప్లెక్స్ వెనుక వైపు ఉన్న సీఎల్ఆర్ మొబైల్ దుకాణంలో దొంగలు చోరీకి యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి జనాలు తిరగని సమయంలో దుకాణం షెట్టర్‌కు ఉన్న తాళాన్ని బండ రాళ్లతో పగులగొట్టేందుకు ప్రయత్నించారు. తాళం తెరుచుకోకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు. ఈ విషయాన్ని సోమవారం ఉదయం దుకాణ యజమాని గమనించి మొబైల్ షాప్‌లోని వస్తువులు గమనించగా ఏమి తీసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పూర్తిస్థాయిలో గస్తీ నిర్వహించాలని దుకాణ యజమానులు కోరుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ట్రాక్టర్లను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు



పాపాఘ్ని నదిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఎద్దుల బండి, ట్రాక్టర్లతో ఉచితంగా తీసుకోవచ్చని చెప్పడంతో వేంపల్లి పాపాగ్ని నదిలో ఇసుక ట్రాక్టర్ల జాతర మొదలైంది. రోజుకు 200కు పైగా ట్రాక్టర్లు నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సంబంధించిన ట్రాక్టర్లు పాపాగ్ని నదిలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. దీంతో వారి ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో వేంపల్లి సీఐ సురేష్ రెడ్డి జోక్యం చేసుకుని ఇంటి అవసరాలకు మాత్రమే ట్రాక్టర్లతో ఇసుకను ఎవరైనా తీసుకెళ్ల వచ్చునని వారిరువురికి సర్ది చెప్పి పంపించారు.

పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని పెన్నానది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా ప్రతిరోజు దాదాపు 45 ట్రాక్టర్లు కడప, ఖాజీపేట, మైదుకూరు తదితర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తూ మితిమీరిన వేగంతో, ట్రాక్టర్లు వెళ్లటం చూసి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అక్రమ రవాణాను అడ్డుకునే నాథుడే లేడా అని ప్రజలు వాపోతున్నారు. బరితెగించిన తెలుగు తమ్ముళ్లు తమ అదినాయకుడు చంద్రబాబు వాగులు వంకలు అని చెప్పడం మూలాన పెన్నానది నుంచి అడ్డూ అదుపు లేకుండా ఇష్టం వచ్చిన రీతి ఇసుకను తరలిస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెద్దముడ్యం : మహిళ అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పివి రమణ తెలిపారు. ఎస్ వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలిచెర్ల పెద్దమసీదులో శాషవలీ (32) నమాజ్ చదివిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని స్వగ్రామం వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు కాగా, బెంగుళూరు నగరంలోని నూర్ మహమ్మద్ పెద్ద కుమార్తె హీనా (26)తో వివాహమై ఏడు సంవత్సరాలు అవుతోంది. వీరికి ముగ్గురు పిల్లలు. గత నెల 29న ఉదయం మసీదుకు వెళ్లి నమాజ్ చేసుకుని వచ్చి నిద్రపోగా 9 గంటల సమయంలో ఇంటి నుండి భార్య బయటకు వెళ్లింది. ఇంటికి తిరిగి రాలేదు. విచారించినా భార్య ఆచూకి తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం సోమవారం నిర్వహించింది. ఆర్టీసీ సమస్యలపై పలువురు తమ సమస్యలు, సలహాలను సూచించారని, ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు.

- ఖాజీపేట బస్టాండులో బస్సుల సమయాలను సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేయాలని గజ్జెల మల్లారెడ్డి కోరారు.
- కమలాపురం బస్టాండులో బస్సుల సమయానికి తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికుడైన రాజశేఖర్‌డ్డి విన్నవించారు.
- కడప నుంచి చిత్తూరుకు సరైన సమయంలో బస్సులు లేవని కడపకు చెందిన యతీష్‌రెడ్డి కోరారు.
- కడపనుంచి లక్కిరెడ్డిపల్లె మీదుగా రాయచోటి వయా రామాపురం మీదుగా బస్సులను నడపాలని బాబుల్‌రెడ్డి, పక్కీరయ్య, సుబ్బారెడ్డి విశ్వనాథ కోరారు.
- రాయచోటి–వేంపల్లె మధ్య తిరుగుతున్న పల్లె వెలుగు సర్వీసులు సమయ పాలన పాటించడం లేదని రాయచోటికి చెందిన శ్రీనివాసులు, వేంపల్లెకు చెందిన వెంకట్ తెలిపారు.
- కడపనుంచి హిందూపురంకు రాయచోటి మీదుగా బస్సును ఏర్పాటు చేయాలని రాయచోటికి చెందిన లక్ష్మినరసింహారాజు కోరారు.
- కడప–మైదుకూరు–పామూరు బస్సు సర్వీసును ఉదయం 7 గంటలకు నడిచేలా చూడాలని, అలాగే బద్వేలు–విజయవాడ వయా పామూరు బస్సు 11.30 గంటలకు బయలుదేరేలా చూడాలని పామూరుకుచెందిన నరసింహారావు కోరారు.
- ప్రొద్దుటూరు–కడప మధ్య ఉదయం సమయంలో పల్లె వెలుగు బస్సులు తక్కువగా ఉన్నాయని, ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణీకుల పట్ల సత్సంబంధాలు కలిగి ఉండేలా ఆదేశించాలని ప్రొద్దుటూరుకు చెందిన సూర్యం కోరారు.

ప్రయాణీకులు సూచించిన సలహాలు, సూచనలు ఆయా డిపోల మేనేజర్లకు తెలియజేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించామని గోపాల్‌రెడ్డి తెలిపారు.